www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | శుక్రవారం, అక్టోబర్30,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:194 | పేజీలు: 8 | వెల: రూ.5/-

కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం.



బ్యాలెట్ ద్వారా బీజేపీకి

బుల్లెట్ దింపాం

- ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ నాగ్‌పూర్‌లోనే బీజేపీని ఓడించామన్న మహేశ్ గౌడ్
- మోదీ నియోజకవర్గం వారణాసిలోనూ బీజేపీ ఓటమి పాలైందని వెల్లడి
- ధైర్యముంటే మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని సవాల్
- రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు కూడా రావని జోస్యం

(టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, (సామాన్యుడి అస్త్రం)

"ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు.



రాష్ట్రం కరువులో ఉంటది.. కానీ సుందరీకరణ మాత్రం ఆగదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

తెల్లారి లేస్తే రాజ్యాంగాన్ని పట్టుకొని పోజులు కొట్టే రాహుల్ గాంధీ మీ కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో ఏం జరుగుతుందో మీకు సోయి లేదా.. పబ్లిక్ హియరింగ్ అని చెప్పి.. పబ్లిక్ గొంతు నొక్కడం ఏ రకమైన పబ్లిక్ హియరింగ్ అవుతుందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కరువులో రాష్ట్రం ఉంటే సుందరీకరణ పేరుతో డ్రామాలు మీరే చెప్తున్నారు.. కరువు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఊళ్లల్లో నాటకాలు వేయాలంట.. జానపదాలు పాడాలంట.. పద్యాలు పాడాలట.. డ్రామాలు చేయాలట. ఇక్కడ మాత్రం మూసీలో లక్షన్నర కోట్ల లూటీకి ముఖ్యమంత్రి తెరలేపారని అన్నారు.ఆయనకు రియల్ ఎస్టేట్ తప్ప ఏం తెలియదని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పారు.. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని అంటరు.. అని అంటరని కేటీఆర్ గుర్తు చేశారు. ఇవాళ అధికారుల నుంచి మాకు అందుతున్న సమాచారం ప్రకారం మూసీ ప్రాజెక్టు ముసుగులో వేలాది ఎకరాల లూటీకి ఈ ముఖ్యమంత్రి తెరలేపారు.. అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు.. అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే ఉలిక్కి పడుతున్నరు.. భయపడుతున్నరు.. పబ్లిక్ రాకుండా తూతూ మంత్రంగా ఏదో చేశామంటే చేశా మనిపించుకోవడానికి ఒక ప్రొసీజరల్ ఇష్యూ లాగా చాపకింద తోసేసే ప్రయత్నం చేస్తున్నారు..

బంగారం ధరల్లో స్వల్ప

పెరుగుదల

- తెలుగు రాష్ట్రాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,960
- కిలో వెండిపై రూ.100 తగ్గి రూ.2,19,900కు చేరిన ధర



న్యూఢిల్లీ,(సామాన్యుడి అస్త్రం)

దేశీయ విపణిలో గురువారం పసిడి ధరలు స్వల్పంగా పుంజుకోగా, వెండి ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. పండుగల సీజన్ నేపథ్యంలో బంగారం ధరలు రోజువారీగా హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి.గురువారం ఉదయం నమోదైన గణాంకాల ప్రకారం.. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,960 వద్ద కొనసాగుతోంది.అదే విధంగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,960గా, 18 క్యారెట్ల ధర రూ.1,07,970గా నమోదైంది.

టామ్‌కామ్ సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం

- గతంలో కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సురేఖ
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటే సరిపోదన్న ప్రవీణ్ కుమార్

కొండా సురేఖ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్,(సామాన్యుడి అస్త్రం)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల విషయంలో మాజీ మంత్రి కొండా సురేఖ షరతులు లేకుండా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సురేఖ తన వ్యాఖ్యలను కేవలం వెనక్కి తీసుకుంటే సరిపోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్‌పై తన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమైనవి కావని, వాటిని వెనక్కి తీసుకుంటున్నానని కొండా సురేఖ తాజాగా చేసిన ప్రకటనపై ప్రవీణ్ కుమార్ స్పందించారు.



హైదరాబాద్ స్వీట్ షాపులపై దాడులు

పుల్లారెడ్డి సహా పలు సంస్థలపై వేటు



- హైదరాబాద్‌లోని జి.పుల్లారెడ్డి స్వీట్స్ లైసెన్స్ సస్పెండ్
- సనత్‌నగర్ యూనిట్‌లో 3,133 కిలోల ఆహార పదార్థాలు సీజ్
- ఎలుకల వ్యర్థాలు, అపరిశుభ్రత కారణంగా అధికారుల చర్యలు

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

దీపావళి పండుగ సమీపిస్తున్న వేళ హైదరాబాద్‌లోని పలు స్వీట్ షాపులు, తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లు తయారు చేస్తున్నారని గుర్తించి... నగరంలో ఎంతో పేరున్న జి. పుల్లారెడ్డి స్వీట్స్ సహా పలు సంస్థలపై కఠిన చర్యలు తీసుకున్నారు. పుల్లారెడ్డి స్వీట్స్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు.



భారీ లాభాల్లో ముగిసిన

మార్కెట్లు

- 905 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 237 పాయింట్లు లాభపడిన నిఫ్టీ
- ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్లు

అర్నబ్ తుపాను ఎఫెక్ట్

సముద్రంలో చిక్కుకున్న భారీ కార్గో నౌక

అమరావతి,(సామాన్యుడి అస్త్రం)

'అర్నబ్' తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ తుపాను కారణంగా విశాఖపట్నం నుంచి సింగపూర్‌కు వెళ్తున్న ఒక భారీ కార్గో నౌక సముద్రంలో చిక్కుకుపోయింది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ నౌక ముందుకు కదలలేని స్థితిలో నిలిచిపోయింది.




కొత్త అల్పపీడనం

దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం

అమరావతి,

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

- తెలంగాణలో 102 స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- స్టాటిస్టిక్స్ డిగ్రీ అర్హత ఉన్నవారికి సువర్ణావకాశం

హైదరాబాద్(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక, గణాంక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. అక్టోబర్ 30 నుంచి ఈ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 27 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



తిరుమలలో నీటి కొరత లేదు

- తిరుమలలో 150 రోజులకు సరిపడా నీటి నిల్వలు
- వర్షాలు ఆలస్యమైనా ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు

అమరావతి(సామాన్యుడి అస్త్రం)

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక భరోసా ఇచ్చింది. కొండపై రానున్న 150 రోజుల వరకు తాగునీటికి ఎలాంటి ఢోకా లేదని స్పష్టం చేసింది. వర్షాలు ఆలస్యమైనప్పటికీ, భక్తులకు నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.



నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన

- రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం
- నిరసన వాయిదా ఉండదన్న మల్లికార్జున ఖర్గే
- ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల ఆరోపణ
- పండుగల సీజన్ దృష్ట్యా వాయిదా కోరిన వ్యాపార సంఘాలు
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యమన్న రాహుల్ గాంధీ



బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

మొదటి పేజి తరువాయి

జేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు. వారణాసిలో ఓటమి మోదీ పాలనపై ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు




పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు.లక్నో నుంచి పట్నా వరకు బీజేపీకి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత ప్రాంతమైన గోరఖ్‌పూర్‌లో కేవలం 307 ఓట్ల మెజారిటీతో గెలవడమే దీనికి నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి మూడంకెల సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీయేతర శక్తులకు ప్రజా మద్దతు పెరుగుతోందని, ఆయనే తదుపరి ప్రధాని అవుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఓట్ల దొంగతనం'ను నిరసిస్తూ నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నామని, జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

టామ్‌కామ్ సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం

మొదటి పేజి తరువాయి

బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం నేరమని, ఆమె మాటలు తెలంగాణ మహిళల, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపించారు. కేటీఆర్ పెద్ద మనసుతో కోర్టుకు వెళ్లారని, వాస్తవానికి ఆమెపై క్రిమినల్ కేసు పెట్టాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.ఇదే సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామిపై ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. జర్మనీలో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇచ్చి, ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 4.10 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు.ఉచితంగా ఇవ్వాల్సిన అవకాశాలకు డబ్బులు వసూలు చేయడమే కాకుండా, టామ్‌కామ్ పేరుతో కాకుండా 'ఫెయిర్ ట్రీట్' అనే ప్రైవేట్ సంస్థ పేరుతో ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. 200 మంది నుంచి డబ్బులు వసూలు చేసి, 10 మందిని కూడా జర్మనీకి పంపలేదని అన్నారు. మెకాట్రానిక్స్ ఉద్యోగం అని చెప్పి పంపిన ఓ యువకుడికి అక్కడ కత్తి



ఇచ్చి బీఫ్, మటన్ కోయమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ తన కుమారుడు గడ్డం వంశీకృష్ణను ఇలాగే పంపిస్తారా? అని ప్రశ్నించారు.

హైదరాబాద్ స్వీట్ షాపులపై దాడులు..

మొదటి పేజి తరువాయి

టీజీ సేఫ్ (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్), పోలీసులతో కూడిన 13 బృందాలు జీహెచ్ఎంసీ పరిధిలోని 16 ప్రధాన స్వీట్ షాపులపై ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో మొత్తం రూ. 16.86 లక్షల విలువైన 3,546 కిలోల కల్తీ, పాడైపోయిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు 5 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేయగా, లైసెన్సులు లేకుండా నడుస్తున్న మరో 5 షాపులను మూసివేశారు.సనత్‌నగర్‌లోని పుల్లారెడ్డి స్వీట్స్ తయారీ యూనిట్‌లో కుళ్లిన కూరగాయలు, ఎలుకల వ్యర్థాలు, గడువు ముగిసిన పదార్థాలను గుర్తించిన అధికారులు నిర్ఘాంతపోయారు. వంటగది, శుభ్రపరిచే ప్రదేశాలు అత్యంత అపరిశుభ్రంగా ఉండటంతో లైసెన్సును తక్షణమే సస్పెండ్ చేశారు. ఇక్కడి నుంచే ఏకంగా రూ. 15.03 లక్షల విలువైన 3,133 కిలోల ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.చార్మినార్‌లోని ఆగ్రా మిఠాయి ఘర్, వనస్థలిపురంలోని స్వీట్ వన్ రుచులు, ఫలక్‌నుమాలోని బాలాజీ శ్రీ కిషన్ మిఠాయి భండార్, కాటేదాన్‌లోని హిరాణి ఫుడ్స్ లైసెన్సులను కూడా సస్పెండ్ చేశారు. వీటితో పాటు లైసెన్సులు లేకుండా అపరిశుభ్రంగా నడుపుతున్న చంపాపేట్‌లోని బాలాజీ స్వీట్స్, సికింద్రాబాద్‌లోని మమతా స్వీట్ హౌస్ సహా మరో మూడు దుకాణాలను అధికారులు మూసివేయించారు. తనిఖీల్లో భాగంగా 22 ఆహార



నమూనాలను సేకరించి, పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

102 ఉద్యోగాలకు టీజీపీఎస్‌సీ నుంచి కొత్త నోటిఫికేషన్

మొదటి పేజి తరువాయి

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

ఎంపికైన వారికి రూ.1.06 లక్షల వరకు వేతనం

అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలు

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలను టీజీపీఎస్సీ స్పష్టంగా వెల్లడించింది. స్టాటిస్టిక్స్‌ను ప్రధాన సబ్జెక్టుగా చదివి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. వయోపరిమితి విషయానికొస్తే, 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయసు కనీసం 18 ఏళ్లు నిండి, 44 ఏళ్లకు మించకూడదు. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు వంటి రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. దరఖాస్తు రుసుముగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి



ఉండగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించారు.

ఆకర్షణీయమైన వేతనం.. కీలకమైన బాధ్యతలు

ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతన స్కేలుతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. కమిషన్ ప్రకటించిన ప్రకారం, ఉద్యోగంలో చేరిన వారికి నెలవారీ వేతనం రూ. 36,750 నుంచి రూ. 1,06,990 వరకు ఉంటుంది. ప్రభుత్వ పథకాల ప్రణాళిక, అమలులో ఈ పోస్టులది కీలక పాత్ర. మండల స్థాయిలో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను సేకరించడం, వాటిని విశ్లేషించడం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం వంటివి వీరి ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

పరీక్ష విధానం.. ముఖ్యమైన తేదీలు

ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను జనవరి నెలలో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. పరీక్షకు వారం రోజుల ముందుగా అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 30న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నందున, ఆసక్తిగల అభ్యర్థులు చివరి తేదీ అయిన నవంబర్ 27 వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. జోన్ల వారీగా ఖాళీలు, సిలబస్, పరీక్ష విధానం వంటి పూర్తి వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే, వాటిని కమిషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే వెల్లడిస్తుంది.

రాష్ట్రం కరువులో ఉంటది..
కానీ సుందరీకరణ మాత్రం ఆగదు : కేటీఆర్

మొదటి పేజి తరువాయి

ఆదిలాబాద్‌లో ఈ మధ్యకాలంలోనే గత వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.. ప్రజల కష్టాలు చూడకుండా.. రైతుల కన్నీళ్లు తుడవకుండా.. వాటి గురించి ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి సోయి లేదు.. పట్టింపు లేదని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. .. ఇవాళ 100 శాతం ఎస్‌టీపీల నిర్మాణం పూర్తయిపోయింది.. మా ప్రభుత్వంలోనే మేమే రూ.4 వేల కోట్లతో కట్టాం. మొత్తం ప్రాజెక్టు కూడా రూ.16 వేల కోట్లల్లో పూర్తి చేయొచ్చు. డీపీఆర్ బయటపెట్టండి అని మేం అసెంబ్లీలో అడిగితే ఈ రోజు వరకు సమాధానం లేదు.. ఏసియన్ డెవలప్ మెంట్ బ్యాంకు అప్పు తీసుకున్నమంటరు.. మరి వాళ్లకైనా డీపీఆర్ ఇచ్చారా చూపించమంటే అది కూడా దిక్కు లేదు.. అంటే డీపీఆర్ లేదు.. పబ్లిక్ హియరింగ్ జరుగదు.. రాష్ట్రం కరువులో ఉంటది.. కానీ సుందరీకరణ మాత్రం ఆగదన్నారు.హైదరాబాద్‌లో తాగునీరు లేదు.. హైదరాబాద్‌లో రోజులకు 7 వేల ట్యాంకర్ల నీళ్లు బుక్ అవుతున్నయి.. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన 10 టీఎంసీల మల్లన్నసాగర్ నీళ్లు తీసుకొని మాత్రం మూసీలో తీసుకొచ్చి పోస్తా.. ఇది ముఖ్యమంత్రి విధానం. మీకసలు మానవత్వం ఉందా..? అని ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. కనీస మాత్రం సంస్కారం ఉందా..? ప్రజల పట్ల పట్టింపు ఉందా..? లేదా ఎంతసేపు మీకు ఢిల్లీకి వెళ్లి ఈఎంఐలు కట్టడానికే సరిపోతుందా..? ఈఎంఐ ముఖ్యమంత్రి అని అడుగుతున్నా..? ఇదే పట్టింపు.. సుందరీకరణ మీదున్న శ్రద్ద, ఆసక్తి,, మూసీ మీదున్న తాపత్రయం ఇవాళ వేరే విషయాల్లో ఎందుకు లేదని కేటీఆర్ ప్రశ్నించారు..మీ కాంగ్రెసోళ్లు మేడిగడ్డ పిల్లర్లు పేల్చేసి మూడేళ్లవుతుంది.. అక్కడ బ్లాస్టింగ్ శబ్దం వినబడిందని ఆ రోజుల్లోనే.. అప్పుడున్న ప్రభుత్వంలోనే ఇంజినీర్లు పోయి పోలీస్ కంప్లెయింట్ కూడా ఇచ్చారు. అక్టోబర్ 21 2023.. మూడేళ్లవుతుంది. దానిపై ఎంక్వైరీ కాదు.. ఆ పగ్గె పడ్డ పిల్లర్ రిపేరు కాదు..

కొత్త అల్పపీడనం..



మొదటి పేజి తరువాయి

అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు

దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం

రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు

కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

అర్నబ్ తుపాను ఎఫెక్ట్

మొదటి పేజి తరువాయి

ఇంజిన్ ఫెయిల్యూర్ కావడమే ఘటనకు కారణంగా గుర్తింపు

రంగంలోకి దిగిన కోస్ట్ గార్డ్.. సుజయ్ నౌకతో సహాయక చర్యలు

వివరాల్లోకి వెళితే.. మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన 'సిగ్మా పెరల్' అనే కార్గో నౌక విశాఖ పోర్టులో సరుకును అన్‌లోడ్ చేసిన అనంతరం సింగపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో కేజీ బేసిన్‌లోని రవ్వా ఆయిల్ ఫీల్డ్ సమీపానికి చేరుకోగానే, తుపాను ప్రభావంతో ఎగిసిపడుతున్న భీకరమైన అలల ధాటికి నౌక ఇంజిన్ ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న భారత తీర రక్షక దళం (కోస్ట్ గార్డ్) అధికారులు తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు కేంద్రంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. నౌకలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించేందుకు 'సుజయ్' అనే కోస్ట్ గార్డ్ నౌకను ఘటనా స్థలానికి పంపించారు. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

తిరుమలలో నీటి కొరత లేదు

మొదటి పేజి తరువాయి

గురువారం ఆయన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తిరుమలకు నీటిని సరఫరా చేసే ప్రధాన జలాశయాలను పరిశీలించారు. గోగర్భం, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యామ్‌లలో నీటి నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ, "ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సుమారు 150 రోజులకు సరిపోతాయి. ఒకవేళ వర్షాలు ఆలస్యమైనా నీటి కొరత రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం" అని వివరించారు.ఇటీవల ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చైర్మన్ వెల్లడించారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని, నీటి సమస్య ఉండదనే విశ్వాసాన్ని సీఎం వ్యక్తం చేశారని నాయుడు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కల్యాణి డ్యామ్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా నీటి సరఫరాను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన

మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.

వాయిదా వేయాలని వ్యాపార సంఘాల విజ్ఞప్తి


పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే: రాహుల్ గాంధీ

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు వినియోగించాలి

ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ ఫలాలు అందాలి
లక్షిత వర్గాలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చండి
అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
ప్రత్యేక నిధుల ఖర్చుపై శాఖల వారీగా సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 29 (సామాన్యుడి అస్త్రం)

ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కఅధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల ద్వారా లక్షిత వర్గాలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని సూచించారు. వ్యవసాయం, విద్యుత్, గృహ వసతి, సామాజిక మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు వంటి కీలక రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సేవసచివాలయంలో గురువారం వ్యవసాయ, ఇంధన, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు వర్తించే పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా విశ్లేషించాలని ఆదేశించారు.భూమి యాజమాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల కారణంగా ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ పథకాల ద్వారా అందుతున్న సహాయం, సాధారణ పథకాల వ్యయంతో పోలిస్తే ఎంత మేరకు ఉందో స్పష్టమైన గణాంకాలతో నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాల పంపిణీ వంటి పథకాల్లో లబ్ధి పొందిన రైతుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గాలు, అందించిన సహాయం తదితర వివరాలతో జాబితాలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో సుమారు 1,300 ఎకరాల మేర ఖాళీగా భూములు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించగా.. అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను భట్టి ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని పేర్కొన్నారుఅర్హులైన కుటుంబాలకు ఇండ్ల స్థలాల కోసం పంపిణీ చేసే అవకాశాలను పరిశీలించాలని, ప్రతి నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు ఇతర మౌలిక సదుపాయాల అవసరాలను గుర్తించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు, విద్యుత్ సదుపాయాల మెరుగుదల కు చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. సమావేశంలో ఉన్నత అధికారులు నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్ర బోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ లక్ష్యాన్ని అభినందిస్తున్నా



రాష్ట్రం నుంచి ఆస్ట్రేలియాకు తాండూరు కందిపప్పు ఎగుమతి
నిజామాబాద్ పసుపుకు మంచి డిమాండ్
కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

హైదరాబాద్, అక్టోబర్ 29(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ నిర్దేశించుకున్న తెలంగాణ రైజింగ్– 2047’ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. లక్ష్య సవాలుతో కూడుకున్నదే అయినా సమష్టి కృషితో సాధించొచ్చని పేర్కొన్నారు. రాష్ట్రం లో ఫార్మా, అంతరిక్షం, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, ఆహార శుద్ధి, పరిశోధన, ఆవిష్కరణలరంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – కర్టెన్ రైజర్ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పెట్టుబడులు పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు ప్రధానంగా ఆశించేది విధానాల్లో స్థిరత్వం, నిబంధనల్లో స్పష్టత, వ్యాపార నిర్వహణలో పారదర్శకతేనని పేర్కొన్నారు. ఇందుకు కాకతీయుల కాలం నాటి ఉదాహరణను ప్రస్తావించారు. క్రీ.శ. 1244లో గణపతిదేవుడు మోటుపల్లి ఓడరేవులో జారీ చేసిన అభయ శాసనం సముద్ర వాణిజ్యంలో కీలక సంస్కరణలకు నాంది పలికిందని గుర్తు చేశారు.2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలోనే ప్రపంచంలో మొదటి ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భార త్ నిలిచిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మధ్య ఆసియా సంక్షోభం వంటి సవాళ్లు ఎదురవుతున్నా అంచనాలను అధిగమించి ఎగుమ తులు పెంచామన్నారు.

ప్రపంచస్థాయి మార్కెట్లకు తెలంగాణ ఉత్పత్తులు

తెలంగాణ ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు ఉన్నాయని కేంద్ర మంత్రి పీయూష్ తెలిపారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అత్యధిక ఎగుమతి సామర్థ్యం ఉన్న 50 ఉత్పత్తులు, సేవలను గుర్తించాలని చెప్పారు.తెలంగాణలోని జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు వచ్చేలా నాణ్యమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఉత్పత్తుల మూలాలను గుర్తించే ట్రేసబిలిటీ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. తాండూరు కందిపప్పు, చపాటా మిర్చి, నిజామాబాద్ పసు పు వంటి ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఇటీవల తాండూరు ఎర్ర కందిపప్పు ఉత్పత్తులను హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి చేయడం తెలంగాణ ఉత్పత్తులకు ఉన్న అవకాశాలకు నిదర్శనమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు

ఫార్మా రంగానికి అధిక ప్రాధాన్యం..

ఫార్మా రంగంలో మరింత ఉన్నత స్థాయికి తెలంగాణ ఎదగాలని కేంద్రమంత్రి గోయ ల్ ఆకాంక్షించారు. జనరిక్ ఔషధాల తయారీకి మాత్రమే పరిమితం కాకుండా, అధిక విలువ కలిగిన బ్రాండెడ్, వినూత్న ఔషధాలు, బయోసిమిలర్ల తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంతరిక్షం, విమా నయాన రంగాలు, విమాన విడిభాగాల తయారీ, నిర్వహణ–మరమ్మతు సేవలు(ఎంఆర్ఓ), రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సహించాలని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు.జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధిని ప్రస్తావించారు. దీపావళి వేళ ఒక్కో దీపం వెలిగించడం ద్వారా వెలుగులు విస్తరించినట్లే.. ఒక్కో పెట్టుబడి, ఒక్కో ఎగుమతి, ఒక్కో కొత్త ఉద్యోగం, ఒక్కో స్టార్టప్ దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. భారత్, తెలంగాణ భవి ష్యత్తు ఉమ్మడి కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదా రులు తెలంగాణలోని అవకాశాలను పరిశీలించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆహ్వానించారు.ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావా లని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు

బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి
అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న మహేశ్ గౌడ్
నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్

హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారాన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనిరుధ్ రెడ్డికి త్వరలోనే నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని సూచించారు.”జడ్చర్లలో నేను చస్తేనే బిల్లులు వస్తాయంటే... నియోజకవర్గ అభివృద్ధి కోసం చనిపోవడానికైనా సిద్ధం” అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. ఈ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ... నిధుల కొరత ఒక్క జడ్చర్లలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఉందని, ఇలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఈ అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు.నవంబర్ 1న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ ర్యాలీకి కార్యకర్తలను తరలించేందుకు ప్రత్యేక రైళ్ల కోసం దరఖాస్తు చేస్తే, దక్షిణ మధ్య రైల్వే సాకులు చెప్పి తిరస్కరిస్తోందని మహేశ్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పేరు చెబితేనే బీజేపీ వణికిపోతోందని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ నుంచి కార్యకర్తలను ఢిల్లీకి తీసుకెళ్లి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించండి



అది కాకుండా మూసీ ప్రక్షాళన ఎలా చేస్తారు?
ఎంపీ ఈటెల రాజేందర్
మూడో రోజు కొనసాగిన జన సంకల్పన యాత్ర

మేడ్చల్, అక్టోబర్ 29 (సామాన్యుడి అస్త్రం)

జవహర్ నగర్ డంపింగ్ యార్డుసమస్య శాశ్వత పరిష్కారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ తయారుచేసి ఇస్తే కేంద్రం నుంచి నిధులు తెచ్చే బాధ్యత తనదని ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈటల చేపట్టిన జన సంకల్పన యాత్ర మూడవ రోజు కీసర మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా కీసరలో ఆయన మాట్లాడుతూ.. తాను ఇదివరకే కేంద్రమంత్రితో మాట్లాడానని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి డీపీఆర్ తేవాలని సూచించారని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్ ఇస్తే కేంద్రం నుంచి ఎన్ని వేల కోట్ల రూపాయలైనా తెస్తానన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల లక్షలాదిమంది ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. డంపింగ్ యార్డ్ సమస్య కేవలం డబ్బుల కోణంలో కాకుండా, ప్రజారోగ్య కోణంలో చూడాలన్నారు. లిచ్చట్ నీటితో చెరువులు కలుషితమవుతున్నాయని, బోరు బావుల్లో రంగు మారిన నీరు వస్తోందని పేర్కొన్నారు.చెరువులు కలుషితం కావడం వల్ల వాటి మీద ఆధారపడిన వివిధ కుల వృత్తులు మత్స్యకారులు, రజకులు, యాదవులు, రైతులు ఉపాధి కోల్పోయారు అన్నారు. డంపింగ్ యార్డ్ నిర్వహణలో రాంకీ సంస్థ పూర్తిగా విఫలమైందని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. చెత్త నుంచి విద్యుత్తు, ఎరువు తదితర ఉత్పత్తులు తయారు చేసే అవకాశం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో చేయడం లేదన్నారు. ఆధునిక సాంకేతికత ఉపయోగిస్తే ఒక్క గ్రామ చెత్త కూడా వృధా కాకుండా రీసైక్లింగ్ చేయవచ్చు అన్నారు.

మూసి ప్రక్షాళన ఎలా చేస్తారు?

2 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి డంపింగ్ యార్డ్ తొలగించలేని సీఎం రేవంత్‌రెడ్డి.. లక్ష కోట్లు ఖర్చు చేసి మూసి ప్రక్షాళన ఎలా చేస్తారని ఈటల ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుక అని గతంలో ఎంపీగా గెలిపిస్తే ప్రజా సమస్యలను పట్టించుకోని సీఎంను ఏమనాలో అర్థం కావడం లేదన్నారు. స్థానిక ప్రజలు ఇచ్చిన ఎంపీ పదవిని ఉన్నత పదవులు పొందడానికి నిచ్చెనగా వాడుకున్నారని విమర్శించారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమయ్యే వరకు తన పోరాటం ఆగబోదని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇతరుల మీద నింద వేయడానికి చేయడం లేదని, డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారం ఉందని భావించిన తర్వాతే పాదయాత్ర మొదలు పెట్టానని ఆయన తెలిపారు. తన పోరాటంలో బాధితులందరూ భాగస్వాములు కావాలని, ఈ నెల 30న జవహర్ నగర్‌లో జరిగే భారీ బహిరంగ సభకు భారీ సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈటల రాజేందర్ పాదయాత్రకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవ లక్ష్మీ నరసయ్య సంఘీభావం తెలిపారు. పాదయాత్ర ఉదయం కీసర నుంచి ప్రారంభమై నాగారం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, సీనియర్ నాయకులు కొంపల్లి మోహన్ రెడ్డి, కౌకుట్ల చంద్రారెడ్డి, జిల్లెల తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో మళ్లీ సోదాలు

- సర్జికల్ స్టోర్‌లో రికార్డుల పరిశీలన.. క్యాంటీన్ కాంట్రాక్టులపైనా తనిఖీలు

హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో అధికారుల తనిఖీలు మరోసారి కొనసాగాయి. అవినీతి నిరోధక శాఖ అధికారులు డ్రగ్స్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ విభాగాల అధికారులతో కలిసి ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. సుమారు పది మంది అధికారుల బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నట్లు సమాచారం.సిటీ గైడ్స్ చూడండినిమ్స్ సర్జికల్ స్టోర్(లో ఔషధాల కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. కొనుగోళ్ల వివరాలు, సంబంధిత పత్రాలను తనిఖీ చేస్తూ అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.మరోవైపు, నిమ్స్ క్యాంటీన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. క్యాంటీన్ నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్టు పత్రాలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేయడం ద్వారా దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారుఈ తనిఖీలు డాక్టర్ లక్ష్మీ భాస్కర్ వ్యవహారానికి సంబంధించిన విచారణలో భాగంగా జరుగుతున్నట్లు సమాచారం. అయితే, తనిఖీల్లో ఏయే అంశాలు గుర్తించారనే దానిపై అధికారిక వివరాలు వెల్లడికావాల్సి ఉంది. దర్యాప్తు పూర్తయ్యాకే తదుపరి పరిణామాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



23 ఏళ్ల భూ వివాదానికి తెర.. తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో విజయం



హైదరాబాద్, అక్టోబరు 29 (సామాన్యుడి అస్త్రం)

: మియాపూర్ భూవివాదంపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చరిత్రాత్మక విజయం వరించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ సర్వే నంబర్లు – 100, 101లోని భూములపై సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 550 ఎకరాలకు పైగా ఉన్న ఈ భూములపై ప్రైవేట్ వ్యక్తుల అప్పీళ్లను సర్వోన్నత న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. ఈ వివాదాస్పద భూములు పూర్తిగా ప్రభుత్వానివేనని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది.1912 నాటి సర్వే రికార్డుల ప్రకారమే ఈ భూములు 'సర్కారీ పోరంబోకు' కిందకు వస్తాయని సుప్రీంకోర్టు వెల్లడించింది. 2003 నాటి ఉమ్మడి హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ప్రైవేటు వ్యక్తుల పిటిషన్లను ధర్మాసనం తోసిపుచ్చింది. తెలంగాణ ప్రభుత్వ భూములను కైవసం చేసుకునేందుకు జరిగిన ప్రైవేట్ వ్యక్తుల ప్రయత్నాలు చెల్లవని స్పష్టం చేసింది. సరైన పర్యవేక్షణ లేక గత 23 ఏళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న సంచలనాత్మక భూవివాదానికి తెరపడింది.

ఎస్సీ వర్గీకరణ.. శాఖలకు సర్కారు ఆదేశాలు!



హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, బదిలీల్లో వర్గీకరణ నిబంధనలను పాటించాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు ఈ ఆదేశాలను అమలు చేయాల్సి ఉంటుంది.

మూడు గ్రూపులుగా ఎస్సీ ఉపకులాల విభజన

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు (2024లో ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ సిఫారసుల ఆధారంగా 2025 ఏప్రిల్ 14న గెజిట్ నోటిఫికేషన్ (విడుదల చేసి, 59 ఎస్సీ ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించినట్లు అందిన వివరాల్లో ఉంది. ఈ విభజన ప్రకారం మొత్తం 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను మూడు గ్రూపులకు కేటాయించారు.మ్యాప్‌లు చూడండి

గ్రూప్-ఏ 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్.

గ్రూప్-బీ : 18 ఉపకులాలకు 9 శాతం రిజర్వేషన్. ఇందులో మాదిగ కులం ఉంది.
గ్రూప్-సీ : 26 ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్. ఇందులో మాల కులంతో పాటు మరో 25 ఉపకులాలు ఉన్నాయి. సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులు, జనాభా వివరాలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో లభించిన ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఈ విభజన చేసినట్లు వివరాలు సూచిస్తున్నాయి.

ఉద్యోగ నియామకాల్లో ఎలా అమలు చేస్తారు?

కొత్త ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా రోస్టర్ విధానం అమలు చేయాల్సి ఉంటుంది. ఏ పోస్టును ఏ గ్రూపు కింద భర్తీ చేయాలనే అంశాన్ని సంబంధిత నిబంధనల ప్రకారం నిర్ణయించాల్సి ఉంటుంది. ఒక గ్రూపులో అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే, తదుపరి గ్రూపుకు అవకాశం కల్పించాలా లేదా ఖాళీని తదుపరి నియామకాల వరకు కొనసాగించాలా అనే అంశాన్ని అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం నిర్ణయించాలి. దీనికి సంబంధించిన విధానం ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

మాదిగ ఉద్యోగుల విజ్ఞప్తితో ఆదేశాలు?

వర్గీకరణ అమలులో కొన్ని శాఖలు నిర్లక్ష్యం చేస్తున్నాయనే అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనంలో ఉంది. ఈ నేపథ్యంలో మాదిగ ఉద్యోగుల సమన్వయ కమిటీ ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు వివరించారు. అన్ని శాఖల్లోనూ వర్గీకరణ అమలయ్యేలా తాజా ఆదేశాలు జారీ చేసినట్లు అందిన కథనం వెల్లడిస్తోంది.

విద్యార్థులు, ఉద్యోగార్థులు ఏం చేయాలి?

ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత గ్రూపు వివరాలను పరిశీలించుకోవాలి. దరఖాస్తు చేసే సమయంలో ఆయా నియామక ప్రకటనల్లోని అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ వివరాలను జాగ్రత్తగా గమనించాలి.

తెలంగాణలో డేటా సెంటర్లకు ప్రత్యేక
అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలు జారీ

రాష్ట్రంలోని డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీచేసింది. డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారానికి కొత్త నిబంధనలు విధించింది.



హైదరాబాద్, అక్టోబరు 29 (సామాన్యుడి అస్త్రం)

రాష్ట్రంలోని డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం జారీచేసింది. డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారానికి కొత్త నిబంధనలు విధించింది. నవంబర్ 6వ తేదీ నుంచి సమర్పించే తాత్కాలిక ఫైర్ ఎన్ఓసీ దరఖాస్తులకు కొత్త మార్గదర్శకాలు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. సర్వర్లు, బ్యాటరీలు, యూపీఎస్, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. డేటా సెంటర్లలో ఫైర్ అలారాలు, అగ్నిమాపక వ్యవస్థలు తప్పనిసరి చేసింది.టెక్నికల్ విభాగాల్లో వాటర్ మిస్ట్ లేదా క్లీన్ ఏజెంట్ గ్యాస్ ఫైర్ సప్రెషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిప్రమాద వ్యాప్తిని అడ్డుకునే విభజనలు, అత్యవసర మార్గాలు, అగ్నిమాపక నీటి నిల్వలు తప్పనిసరి చేసింది. మండే స్వభావం ఉన్న ప్యాకింగ్ సామగ్రి, వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను భవన నిర్వహణ, అత్యవసర స్పందన వ్యవస్థలతో అనుసంధానం చేయాలని సూచించింది. భద్రతతో పాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. కీలక డిజిటల్, మౌలిక సదుపాయాల రక్షణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతే లక్ష్యమని తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది.

హైదరాబాద్‌లో నీటి వృథాకు చెక్..
'పానీ' యాప్ ప్రారంభించిన మంత్రి పొన్నం



భాగ్యనగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన 'పానీ' యాప్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. తాగునీటి సంరక్షణ కోసం హైదరాబాద్ జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు నగర పౌరులను భాగస్వాములను చేస్తూ 'పానీ' పేరుతో యాప్‌ను సిద్ధం చేసింది.

హైదరాబాద్:(సామాన్యుడి అస్త్రం)

భాగ్యనగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రూపొందించిన 'పానీ' యాప్‌ను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. తాగునీటి సంరక్షణ కోసం హైదరాబాద్ జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు నగర పౌరులను భాగస్వాములను చేస్తూ 'పానీ' పేరుతో యాప్‌ను సిద్ధం చేసింది. దీనిని నేడు (గురువారం) జలమండలి కార్యాలయంలో మంత్రి పొన్నం, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకే 'పానీ' యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. కేవలం జలమండలి అధికారులు, సిబ్బంది ద్వారానే అన్ని ప్రాంతాల్లో నీటి సంరక్షణ సాధ్యం కాదని పేర్కొన్నారు. అందుకే ప్రజలనూ భాగస్వాములను చేస్తున్నట్లు చెప్పారు. నీటి సంరక్షణపై ఆసక్తి ఉన్న ప్రతి పౌరుడు ఇందులో 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు మంత్రి తెలిపారు. ఈ యాప్‌లో ప్రతి పౌరుడు నమోదు చేసుకుని, వాలంటీర్‌గా ఫిర్యాదు చేయాలని పొన్నం సూచించారు.మరోవైపు, మహా నగరంలో భారీ వర్షాలు పడినప్పుడు నీటిని సంరక్షించడంపై ప్రజలు తగిన శ్రద్ధ చూపడం లేదని మంత్రి పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంచాల్సిన అవసరం ఉందని, ఈ బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకు ప్రతి ఇంటి ఆవరణలోనూ ఇంకుడుగుంత ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని పిలుపునిచ్చారు. నగర ప్రజలపై జరిమానాలు విధించడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, నీటి పొదుపుపై అవగాహన కల్పించడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

రేషన్ కార్డు ఉన్నవారికి పండగే..
ప్రభుత్వం కొత్త ప్లాన్!

- సంక్రాంతి నుంచి రేషన్ కార్డుదారులకు కొత్త పథకం?
- బియ్యంతో పాటు మరో ఆరు సరుకులు!

హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణలో రేషన్ కార్డుదారులకు అదనపు ప్రయోజనాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వం.. ఇకపై బియ్యంతో పాటు మరో ఆరు రకాల నిత్యావసర సరుకులను కూడా అందించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం ఈ ప్రతిపాదన ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

రేషన్ దుకాణాల్లో బియ్యంతో పాటు ఆరు సరుకులు!

ప్రస్తుతం అందిస్తున్న సన్నబియ్యానికి అదనంగా కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి నిత్యావసర వస్తువులను పంపిణీ చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. వీటిని సబ్సిడీ ధరలకు అందించే అవకాశాలపై స్పష్టత రావాల్సి ఉంది.ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే పేద కుటుంబాలు వంటకు అవసరమైన కీలక సరుకులను కూడా రేషన్ దుకాణాల నుంచే పొందే అవకాశం ఉంటుంది. మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం అమలైతే లబ్ధిదారులకు కొంత ఆర్థిక ఉపశమనం లభించవచ్చు.

3.42 కోట్ల మందికి ప్రయోజనం కలిగేనా?

తెలంగాణలో సుమారు 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు ఉండగా, వాటి ద్వారా దాదాపు 3.42 కోట్ల మంది లబ్ధి పొందుతున్నట్లు అందుబాటులో ఉన్న సమాచారం సూచిస్తోంది. ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యం అందిస్తున్నారు. అదనపు సరుకుల పంపిణీ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే భారీ సంఖ్యలో ఉన్న కార్డుదారులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

సంక్రాంతి నుంచే అమలు చేస్తారా?

ఈ ప్రతిపాదనను సంక్రాంతి నుంచి అమలు చేయాలనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్షలోనూ ఈ అంశం




చర్చకు వచ్చినట్లు వార్తలు వెలువడుతున్నాయి. అయితే, పథకం ప్రారంభ తేదీ, ఒక్కో కార్డుకు అందించే సరుకుల పరిమాణం, వాటి ధరలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బియ్యం నిల్వలపై ప్రభుత్వ దృష్టి

భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరత తలెత్తకుండా ముందస్తు నిల్వలను సిద్ధం చేసుకోవడంపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతంలో మార్పులు, పంటల దిగుబడిపై అనిశ్చితి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సరిపడా బియ్యం నిల్వలు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

ఏపీకి డబుల్ కష్టాలు..
సాధారణ స్థితి వచ్చేవరకు విశ్రమించొద్దు

అర్నబ్ తుపాను అనంతర పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష
రేపటిలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం
పంట నష్టం మినహా ఇతర పరిహారాన్ని వేగవంతం చేయాలని సూచన
నీట మునిగిన పంటలను కాపాడే మార్గాలపై అధ్యయనం చేయాలని పిలుపు
పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితి వచ్చేవరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని ఆదేశాలు



అమరావతి, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరుద్ధరణ చర్యలను సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈరోజు ఉదయం జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు అధికార యంత్రాంగం విశ్రమించవద్దని ఆయన మరోసారి స్పష్టం చేశారు. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను ఇవాళ అందిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "తుపాను సమయంలో అధికార యంత్రాంగం అద్భుతంగా పనిచేసింది. ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత వరకు తగ్గించగలిగాం. ఇప్పుడు పునరుద్ధరణ పనులపై దృష్టి సారించాలి. రేపటిలోగా తుపాను ప్రభావిత ప్రాంతాలన్నింటిలో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి. ఎక్కడైనా రోడ్లపై చెట్లు, చెత్తాచెదారం ఉంటే తక్షణమే తొలగించాలి" అని ఆదేశించారు. నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి ఇప్పటికే జీవో జారీ చేశామని, పంట నష్టం మినహా మిగిలిన బాధితులందరికీ పరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రాష్ట్రం ప్రస్తుతం రెండు రకాల విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి విశ్లేషించారు. "ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు వేసుకోలేని దుస్థితి ఉంది. మరోవైపు, కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్నబ్ తుపాను కారణంగా వేసిన పంటలు, ఉద్యాన తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలను ఆదుకోవాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా రైతులను ఆదుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు నొక్కి చెప్పారు. "నీట మునిగిన పంటలను ఏ మేరకు కాపాడగలమో చూడాలి. దీనిపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులతో కలిసి అధ్యయనం చేయాలి. పంట మట్టిపాలు కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించాలి. పడిపోయిన కొబ్బరి చెట్లు సహా ఇతర ఉద్యాన పంటల మొక్కలను తిరిగి నాటే అవకాశాలు ఉన్నాయేమో పరిశీలించాలి" అని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన రైతులకు వాటిల్లిన నష్టాన్ని భర్తీ చేసేందుకు వివిధ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, పంట నష్టం అంచనాలను వేగంగా పూర్తి చేసేందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం ద్వారా వారి సహకారం పొందాలని ఆయన పేర్కొన్నారు.

కొందరు తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారు..
తర్వాత వాస్తవం తెలుసుకున్నారు: సీఎం చంద్రబాబు



అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా
రెండు రోజుల్లో 100% విద్యుత్ పునరుద్ధరణే లక్ష్యమని ప్రకటన
రూ.4600 కోట్ల ప్రాథమిక నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక
నష్టపోయిన రైతులకు పరిహారం, పునరావాస శిబిరాల నుంచి వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీ

అమరావతి, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

"తుపానును మనం పూర్తిగా నివారించలేం. కానీ, మనకు ఉండే ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని ఎవరికీ ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తీసుకుంటాను" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం నేపథ్యంలో గురువారం ఆయన కృష్ణా, పశ్చిమ గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వ చర్యలను, భవిష్యత్ ప్రణాళికలను సుదీర్ఘంగా వివరించారు.

ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించాం

గతంలో 1977 దివిసీమ తుపాను, 1996 కోనసీమ తుపాను సృష్టించిన విధ్వంసాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, ఆ అనుభవాలతో ఈసారి పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. "ఈసారి ఒకే ఒక్క టార్గెట్ పెట్టుకున్నాను, ప్రాణనష్టం సున్నాగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నా. దురదృష్టవశాత్తు ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. టెక్నాలజీని ఉపయోగించి తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేశాం. రాత్రంతా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ విభాగాలను మోహరించాం. ఏ ప్రాంతంలో ఎంత తీవ్రత ఉంటుందో నిమిష నిమిషానికి సమాచారం అందించాం. దీనివల్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం" అని ఆయన వివరించారు. కొంతమంది తుపాను హెచ్చరికలను ఎగతాళి చేశారని, కానీ తీవ్రత పెరిగాక వాస్తవం గ్రహించారని అన్నారు.

30 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు కళ్లముందు..

ఈ సందర్భంగా 30 ఏళ్ల క్రితం 1996లో వచ్చిన తుఫాను నాటి భయానక పరిస్థితులను చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.
"ఆ రోజు నా కళ్ల ముందు ఆ దృశ్యాలు ఇంకా కదలాడుతున్నాయి. అప్పుడు ప్రైవేట్ ఫ్లైట్స్ లేవు, డిఫెన్స్ విమానంలో వచ్చాను. ఆర్మీ హెలికాప్టర్ సిబ్బంది ప్రాణాపాయం ఉంటుందని నన్ను తీసుకెళ్లలేమని చెప్పినా, నేను బలవంతం చేసి వెళ్లాను. రోడ్డు మీద దిగి మత్స్యకార గ్రామాలను చూస్తే భయంకరమైన దృశ్యాలు కనిపించాయి. ముమ్మడివరం, అమలాపురంలో దిగి ప్రజలకు ధైర్యం చెప్పి, రాజమండ్రి ఆర్డీవో ఆఫీసునే సెక్రటేరియట్‌గా మార్చి, ప్రతి మండలానికి ఒక సెక్రటరీని నియమించి వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు తీసుకొచ్చాం. ఆనాటి పరిస్థితులతో పోలిస్తే, ఈరోజు టెక్నాలజీ సాయంతో వేగంగా స్పందించగలుగుతున్నాం" అని ఆయన తెలిపారు.

వెయ్యి మందిని పంపమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాను

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,000 విద్యుత్ స్తంభాలు దెబ్బతింటాయని అంచనా వేయగా, ఒక్క కోనసీమలోనే 8,000 స్తంభాలు నేలకూలాయని చంద్రబాబు తెలిపారు. "తుపాను తీరం దాటిన వెంటనే చెట్లను తొలగించే పనులు ప్రారంభించాం. ఈరోజు మారుమూల గ్రామాలకు కూడా రోడ్లు క్లియర్ చేశాం. విద్యుత్ పునరుద్ధరణే ఇప్పుడు మా ముందున్న ప్రధాన సవాలు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి 1000 మంది సిబ్బందిని పంపమని కోరాను. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అదనపు సిబ్బందిని తెప్పిస్తాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికి 100% విద్యుత్ ఇచ్చే బాధ్యత తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. టెలికమ్యూనికేషన్ సిగ్నల్స్‌కు అంతరాయం కలగకుండా జనరేటర్లు, డీజిల్ సిద్ధం చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించినా, కొందరు నిర్లక్ష్యం చేశారని, వారికి అవసరమైతే ప్రభుత్వమే డీజిల్ ఖర్చులు భరిస్తుందని చెప్పామని అన్నారు.

నష్టపరిహారంపై స్పష్టమైన హామీ

తుపాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. "కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడాను. ఆయన స్వయంగా ఫోన్ చేసి శుక్రవారం కేంద్ర బృందాన్ని పంపిస్తానని చెప్పారు. ప్రాథమిక నష్టాల నివేదికను కేంద్రానికి పంపాం. కేంద్ర బృందం పర్యటన తర్వాత పూర్తిస్థాయి నివేదిక అందించి సహాయం కోరతాం" అని తెలిపారు. బాధితులకు అందించే పరిహారంపై స్పష్టత ఇస్తూ, "కొబ్బరి, ఆయిల్ పామ్ చెట్టుకు రూ. 1,500 చొప్పున పరిహారం అందిస్తాం. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసరాలతో కూడిన ప్యాకేజీతో పాటు కొంత నగదు కూడా అందిస్తాం. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టం జరగకుండా ఆదుకుంటాం. ఈసారి పంటలకు బీమా కూడా చేయించాం కాబట్టి దిగుబడి తగ్గినా పరిహారం అందుతుంది" అని భరోసా ఇచ్చారు.విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, ఎన్నికలకు, సహాయక చర్యలకు సంబంధం లేదని, విపత్తు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. గత 'మొంథా' తుపాను పరిహారంపై మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిందని, ఈసారి కూడా పక్కాగా అంచనాలు వేసి త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో తుఫానులను తట్టుకునేలా కోస్తా తీరంలోని కీలక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసే ఆలోచన ఉందని చంద్రబాబు వెల్లడించారు.

తుపానుతో కోనసీమ జిల్లాలో వేలాది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి: మంత్రి గొట్టిపాటి



అర్నబ్ తుపానుతో కోస్తా జిల్లాలు అతలాకుతలం
వేలాదిగా నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్
సాయంత్రంలోగా విద్యుత్ పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశం
బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

అమరావతి, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

అర్నబ్' తుపాను కోస్తా జిల్లాల్లో, ముఖ్యంగా కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెను విధ్వంసం సృష్టించింది. గంటల వ్యవధిలో వేలాది విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరగడంతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, రహదారులపై చెట్లు విరిగిపడి రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది.రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వయంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. దెబ్బతిన్న రహదారులు, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ఆయన, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని వెల్లడించారు. నేటి సాయంత్రానికల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని, రహదారులపై పడిన చెట్లను తక్షణమే తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడటంతో పాటు, పంట నష్టం అంచనాలను వెంటనే ప్రారంభించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తుపాను బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా పార్టీ అధ్యక్షుడు మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.మరోవైపు కోనసీమ జిల్లాలో తుపాను ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. వేలాది విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్షేత్రస్థాయిలో అడ్డంకులను తొలగిస్తూ, దెబ్బతిన్న స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తూ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ప్రతి ఇంటికీ తిరిగి విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.


ఏపీ ఇంటర్ విద్యార్థులకు ఊరట.. ఫీజు చెల్లింపు గడువును పొడిగించిన బోర్డు

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు
ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 10 వరకు అవకాశం
రూ.1000 ఆలస్య రుసుముతో నవంబర్ 17 వరకు గడువు
మరోసారి గడువు పొడిగించేది లేదని స్పష్టం చేసిన బోర్డు
అన్ని కాలేజీల నోటీస్ బోర్డులపై వివరాలు ఉంచాలని ఆదేశం

అమరావతి, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంటర్ బోర్డు ఊరట కల్పించింది. 2027 మార్చిలో జరగనున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును పొడిగించింది. వాస్తవానికి, ఫీజు చెల్లించేందుకు ఇవాల్టితో (అక్టోబరు 29) గడువు ముగియనుండగా, విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని బోర్డు కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు.ఈ గడువులోగా ఫీజు చెల్లించలేని విద్యార్థులకు మరో అవకాశం కూడా కల్పించారు. రూ.1,000 ఆలస్య రుసుముతో నవంబర్ 17వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. అయితే, ఇదే చివరి అవకాశమని, ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లీ గడువు పొడిగింపు ఉండబోదని బోర్డు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి, నిర్దేశిత గడువులోగా ఫీజు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఈ పొడిగించిన గడువు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ చదువుతున్న రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులతో పాటు, గతంలో ఫెయిల్ అయిన వారు, ప్రైవేటుగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు కూడా వర్తిస్తుందని బోర్డు పేర్కొంది. విద్యార్థులు తమ కళాశాలల ద్వారానే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.పరీక్ష ఫీజు గడువు పొడిగింపు సమాచారాన్ని విద్యార్థులందరికీ తెలియజేయాలని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలను ఇంటర్ బోర్డు ఆదేశించింది. ఈ వివరాలను తప్పనిసరిగా కాలేజీ నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సూచించింది. చివరి నిమిషంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు లేదా ఇతర ఇబ్బందులను నివారించేందుకు విద్యార్థులు చివరి తేదీ వరకు వేచి చూడవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష ఫీజుకు సంబంధించిన కచ్చితమైన వివరాల కోసం విద్యార్థులు తమ తమ కళాశాలల యాజమాన్యాలను సంప్రదించాలని కోరారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. 23.40 లక్షల ఎకరాల్లో పంట నష్టం



హైదరాబాద్, అక్టోబర్ 29(సామాన్యుడి అస్త్రం)

ఎల్‌నినో ప్రభావంతో మారిన వాతావరణ పరిస్థితులు తెలంగాణ రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. వర్షాభావం, పంటల ఎదుగుదల దశలో తేమ లోపం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23.40 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు రూపొందించింది. ఇందులో అత్యధికంగా 15.88 లక్షల ఎకరాల్లో పత్తి పంట నష్టపోయినట్లు గుర్తించింది. వరి, కంది, మొక్కజొన్నతోపాటు ఇతర పంటలకూ నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొంది. పంట నష్టంపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికను విపత్తుల నిర్వహణ శాఖకు అందించినట్లు సమాచారం. ఈ వివరాలను క్రోడీకరించి కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.పత్తి రైతులపై తీవ్ర ప్రభావంరాష్ట్రంలో పత్తి సాగు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం 15.88 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. మొత్తం పంట నష్టంలో పత్తి వాటానే అధికంగా ఉంది. పత్తి సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో రైతులు ఇప్పటికే పెట్టుబడులు పెట్టారు. పంట చేతికొచ్చే దశలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురుకావడంతో పెట్టుబడులు తిరిగి వస్తాయా లేదా అన్న ఆందోళన నెలకొంది. పత్తి తర్వాత వరి పంటకు కూడా గణనీయమైన నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 4.79 లక్షల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. కంది పంట 1.58 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 70 వేల ఎకరాల్లో నష్టపోయినట్లు గుర్తించారు. మిరప పంటకు 14 వేల ఎకరాల్లో, ఇతర పంటలకు 31 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు. మొత్తంగా అన్ని పంటలు కలిపి 23.40 లక్షల ఎకరాల్లో నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

నాగర్‌కర్నూల్‌లో అత్యధికం

జిల్లాల వారీగా చూస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 4.70 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయి. ఆ తర్వాత నల్లగొండలో 3.58 లక్షల ఎకరాలు, నారాయణపేటలో 2.40 లక్షల ఎకరాలు, సంగారెడ్డిలో 2.19 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. జనగామ, గద్వాల, రంగారెడ్డి జిల్లాల్లోనూ నష్టం గణనీయంగా ఉన్నట్లు అంచనా వేశారు.

త్వరలో కేంద్రానికి నివేదిక

పంట నష్టం తీవ్రత నేపథ్యంలో రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎల్‌నినో కారణంగా సుమారు రూ.20 వేల కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేసిన ప్రభుత్వం, కేంద్రం నుంచి ప్రత్యేక సహాయం అందించాలని ఇప్పటికే శాసనసభ తీర్మానం ద్వారా కోరింది. తాజాగా వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రాథమిక నివేదికను విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా కేంద్రానికి పంపే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. రాష్ట్రం పంపిన నివేదికను పరిశీలించిన అనంతరం కేంద్ర బృందం తెలంగాణలో పంట నష్టం జరిగిన ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి పరిశీలన, నష్టం అంచనాల ఆధారంగా కేంద్ర సాయంపై స్పష్టత రానుంది. మరోవైపు, పంటలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్న రైతులను గుర్తించి సకాలంలో పరిహారం అందించడం కీలకంగా మారింది.

పంట నష్టం వివరాలు:

రాష్ట్రవ్యాప్తంగా పత్తి 15,88,000 ఎకరాల్లో, వరి 4,79,000 ఎకరాల్లో, కంది 1,58,000 ఎకరాల్లో, మొక్కజొన్న 70,000 ఎకరాల్లో, మిరప 14,000 ఎకరాల్లో, ఇతర పంటలు 31,000 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. మొత్తం 23,40,000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి.

జిల్లాల వారీగా పంట నష్టం:

నాగర్‌కర్నూల్ జిల్లాలో 4,70,000 ఎకరాలు, నల్లగొండలో 3,58,000 ఎకరాలు, నారాయణపేటలో 2,40,000 ఎకరాలు, సంగారెడ్డిలో 2,19,000 ఎకరాలు, జనగామలో 2,00,000 ఎకరాలు, గద్వాలలో 1,80,000 ఎకరాలు, రంగారెడ్డిలో 1,69,000 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 1,54,000 ఎకరాలు, మహబూబాబాద్‌లో 1,50,000 ఎకరాలు, వికారాబాద్‌లో 1,24,000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

హైదరాబాద్ పోలీసులకు స్మార్ట్ ఈవీ వాహనాలను ప్రారంభించిన డీజీపీ ఆనంద్



హైదరాబాద్, అక్టోబరు 29 (సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్ సిటీ పోలీసులకు 15 ఈవీ స్మార్ట్ వాహనాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఈరోజు (గురువారం) పెట్లబురుజు సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. స్పందన బృందాలకు – 7, శాంతిభద్రతల విధులకు – 8 టాటా పంచ్ ఈవీ కార్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. టాటా పంచ్ ఈవీ కారుకు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 468 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ వాహనాలు 40 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యం కలిగి ఉన్నాయని వివరించారు. ఇరుకైన వీధులు, గల్లీల్లోకి సైతం వేగంగా చేరుకునేలా కొత్త ఎలక్ట్రిక్ వాహనాలను అమల్లోకి తీసుకువచ్చామని వెల్లడించారు.సీఎస్సార్ కింద వాహనాలను హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సమకూర్చిందని డీజీపీ చెప్పారు. డయల్ – 112 కంట్రోల్ రూమ్ సమన్వయంతో క్షణాల్లో ఘటనా స్థలానికి స్పందన వాహనాలు చేరుకుంటాయని తెలిపారు. భాగ్యనగరంలోని 7 లా అండ్ ఆర్డర్ జోన్లలో 14 స్పందన బృందాలు విధుల్లో ఉంటాయని అన్నారు. ప్రతి వాహనంలో మహిళా డ్రైవర్, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఉంటారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి అర్ధరాత్రి 12:30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో స్పందన సేవలు అమల్లో ఉంటాయని చెప్పారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పనిచేస్తుందని వివరించారు.గత 185 రోజుల్లో 8,903 ఫిర్యాదులకు స్పందన బృందాలు స్పందించాయని డీజీపీ చెప్పుకొచ్చారు. 1,900 సమస్యలను కౌన్సెలింగ్ ద్వారా, 1,164 వివాదాలను రాజీతో పరిష్కరించినట్లు వెల్లడించారు. 2,504 కేసులు స్థానిక ఠాణాలకు బదిలీ, 61 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. తప్పిపోయిన నలుగురు చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు స్పందన బృందాలు అప్పగించాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. మహిళా పోలీస్ డ్రైవర్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే కొత్త ఈవీ వాహనాలను తీసుకువచ్చామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.

నిమ్స్, ఉస్మానియా నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: మంత్రి రాజనర్సింహ



నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో 80 శాతం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు.

హైదరాబాద్: (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి వైద్య, ఆరోగ్య శాఖ సహా సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, శాఖల మధ్య సమన్వయంతో నిర్మాణ సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆజ్ఞాపించారు. మరోవైపు, ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రి ప్రాజెక్టులను చేపట్టినట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు.నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. నిమ్స్ విస్తరణ ప్రాజెక్టులో 80 శాతం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయని, గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. ఈ మేరకు రెండు కీలక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఇక కబ్జా కుదరదు.. ఆర్.కె.పురం చెరువుకు 'హైడ్రా' కంచె



ఆర్.కె.పురం చెరువులో 12 ఎకరాల ఆక్రమణల తొలగింపు
భవిష్యత్తులో కబ్జాలకు ఆస్కారం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు
స్థానికుల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు
అక్రమ పందుల వధశాలలు, ప్రీకాస్ట్ గోడల కూల్చివేత
చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని సూచిస్తూ బోర్డుల ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లోని ఆర్.కె.పురం చెరువు ఆక్రమణల పర్వానికి హైడ్రా గురువారం శాశ్వత అడ్డుకట్ట వేసింది. భవిష్యత్తులో మళ్లీ కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో పటిష్ఠమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఆక్రమణల సమస్యకు ఈ చర్యతో పరిష్కారం లభించినట్లయింది.ఈ కార్యక్రమానికి ముందు, చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించారు. కొందరు వ్యక్తులు ప్రీకాస్ట్ గోడలు, కంచెలు వేసుకుని తమ ఆధీనంలోకి తీసుకున్న భూములను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన పందుల వధశాలలను (కబేళాలను) కూడా కూల్చివేసి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు.స్థానికంగా మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుగాంచిన ఆర్.కె.పురం చెరువు (ముక్కిడికుంట) కొంతకాలంగా కాలుష్యం, కబ్జాలతో కునారిల్లుతోంది. చెరువు పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, పందులను వధించి వ్యర్థాలను చెరువులోనే పారబోయడం వంటి సమస్యలపై స్థానికులు 'ప్రజావాణి'లో పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు, ఆక్రమణలను నిర్ధారించుకున్న తర్వాత ఈ చర్యలు చేపట్టారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, మౌలాలి సర్కిల్ పరిధిలో ఉన్న ఈ చెరువు మొత్తం విస్తీర్ణం 75 ఎకరాలు. ఇప్పటికే ఇందులో 11 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు వెలిశాయి. తాజాగా మరో 12 ఎకరాలను కూడా ఆక్రమించే ప్రయత్నాలు జరగడంతో హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమణల తొలగింపుతో పాటు, ఇది చెరువు ఎఫ్‌టీఎల్ భూమి అని స్పష్టంగా తెలియజేస్తూ అధికారులు ప్రత్యేకంగా బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యతో మినీ ట్యాంక్‌బండ్‌కు పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు, పర్యావరణాన్ని కాపాడేందుకు మార్గం సుగమమైందని స్థానికులు భావిస్తున్నారు.

బ్యాలెట్ ద్వారా బీజేపీకి బుల్లెట్ దింపాం

ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ నాగ్‌పూర్‌లోనే బీజేపీని ఓడించామన్న మహేశ్ గౌడ్
మోదీ నియోజకవర్గం వారణాసిలోనూ బీజేపీ ఓటమి పాలైందని వెల్లడి
ధైర్యముంటే మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని సవాల్
రాబోయే ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు కూడా రావని జోస్యం

హైదరాబాద్, అక్టోబర్29(సామాన్యుడి అస్త్రం)

"ఎన్ని గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యం. బీజేపీ అబ్బ అయిన ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే బీజేపీని ఓడించి, బ్యాలెట్ ద్వారా బుల్లెట్ దింపాం" అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ



(టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఆయన గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ నియోజకవర్గమైన వారణాసి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లలో బీజేపీ ఓటమిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి, బీజేపీ అభ్యర్థి సుధాకర్ కోహ్లేపై 3,271 ఓట్ల తేడాతో విజయం సాధించారని మహేశ్ గౌడ్ గుర్తుచేశారు. బీజేపీకి కంచుకోటలాంటి, కేంద్ర మంత్రి గడ్కరీ, ఫడ్నవీస్ వంటి నేతలు ప్రచారం చేసిన నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ గెలవడం సాధారణ విషయం కాదన్నారు. ఇది బీజేపీ సిద్ధాంతాన్ని అక్కడి విద్యావంతులు, యువత తిరస్కరించడానికి నిదర్శనమని పేర్కొన్నారు.వారణాసిలో ఓటమి మోదీ పాలనపై ప్రజా వ్యతిరేకతను సూచిస్తోందని, ఈ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మోదీ తన వైఫల్యాలను అంగీకరించాలని డిమాండ్ చేశారు. ధైర్యముంటే ఈ ఫలితాలపై మోదీ ప్రెస్ మీట్ పెట్టాలని, గత 12 ఏళ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా నిర్వహించని ప్రధాని కేవలం ట్వీట్లకు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఓడిపోతే ప్రభుత్వ వ్యతిరేకత అనే బీజేపీ, వారణాసిలో ఓటమిని ఎందుకు మోదీకి వ్యతిరేకంగా చూడదని ప్రశ్నించారు.

బీపీ, షుగర్, కిడ్నీ వ్యాధులకు ఇంటిగ్రేటెడ్ ట్రీట్‌మెంట్



బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలకు వేర్వేరుగా కాకుండా ఉమ్మడి చికిత్స

'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్ సిండ్రోమ్'గా గుర్తింపు

దేశవ్యాప్తంగా 50 మంది వైద్య నిపుణులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026'

భారతీయుల శరీర తత్వానికి అనుగుణంగా కొత్త వైద్య ప్రమాణాలు ప్రతిపాదన

కీలక ఔషధాలను నిత్యావసర జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కిడ్నీ జబ్బులు... ఈ మూడింటినీ వేర్వేరు సమస్యలుగా చూస్తూ, వేర్వేరు వైద్యులతో చికిత్స చేయించుకోవడం ప్రమాదకరమని భారత వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మూడు వ్యాధులను కలిపి ఒకే సిండ్రోమ్‌గా పరిగణించి, సమగ్ర చికిత్స అందించాలని సూచిస్తున్నారు. ఈ మేరకు దేశంలోని వివిధ విభాగాలకు చెందిన 50 మంది ప్రముఖ వైద్యులు రూపొందించిన 'వారణాసి డిక్లరేషన్ 2026' పేరుతో ఒక విధాన పత్రాన్ని విడుదల చేశారు. ఈ ప్రతిపాదనలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తూ, ప్రతిష్ఠాత్మక వైద్య జర్నల్ 'ది లాన్సెట్ రీజినల్ హెల్త్ – సౌత్‌ఈస్ట్ ఆసియా'లో ఇది ప్రచురితమైంది.

సమగ్ర చికిత్స ఎందుకు అవసరం?

ప్రస్తుతం మన దేశంలో బీపీకి జనరల్ ఫిజీషియన్, షుగర్‌కు ఎండోక్రైనాలజిస్ట్, కిడ్నీ సమస్యలకు నెఫ్రాలజిస్ట్ వద్దకు వెళ్లే విధానం అమల్లో ఉంది. అయితే బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కలిపి 'కార్డియోవాస్కులర్-కిడ్నీ-మెటబాలిక్' (సీకేఎం) సిండ్రోమ్‌గా చూడాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ మూడు సమస్యలూ ఉన్నవారు పదేళ్లలోపు గుండె జబ్బులతో మరణించే ప్రమాదం 30 నుంచి 50 శాతం వరకు అధికంగా ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఏటా దాదాపు 25 లక్షల మంది ఇలాంటి సమస్యలతో అకాల మరణం చెందుతున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. వీరికి అవసరమైన మూడు కీలక ఔషధాలను (రెనిన్-యాంజియోటెన్సిన్ బ్లాకర్స్, ఎస్జీఎల్‌టీ2 ఇన్హిబిటర్లు, స్టాటిన్లు) కలిపి వాడుతున్న రోగులు 20 శాతం కన్నా తక్కువ ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

భారతీయుల కోసం కొత్త ప్రమాణాలు

పాశ్చాత్య దేశాల ప్రజలతో పోలిస్తే భారతీయుల శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. ఇక్కడ చాలామంది 'థిన్-ఫ్యాట్' రకానికి చెంది ఉంటారు. అంటే, పైకి సన్నగా కనిపించినా, అంతర్గత అవయవాల చుట్టూ కొవ్వు పేరుకుపోయి ఉంటుంది. దీనివల్ల చిన్న వయసులోనే గుండె జబ్బుల ముప్పు పెరుగుతోంది. అందుకే, పాశ్చాత్య దేశాల బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) కొలతలు మనకు సరిపోవని నిపుణులు తేల్చారు. భారతీయులకు బీఎంఐ 23 దాటితే అధిక బరువుగా, 27.5 దాటితే స్థూలకాయంగా పరిగణించాలని సూచించారు. పురుషుల్లో నడుము చుట్టుకొలత 90 సెం.మీ, స్త్రీలలో 80 సెం.మీ మించకూడదని పేర్కొన్నారు. అమెరికా రిస్క్ కాలిక్యులేటర్లకు బదులుగా, మన దేశ ప్రజల సమాచారంతో 'ఇండియా-ప్రివెంట్' పేరుతో ప్రత్యేక రిస్క్ అసెస్‌మెంట్ వ్యవస్థను రూపొందించాలని ప్రతిపాదించారు.

బరువు తగ్గాలనుకుంటున్నారా? ఆకలేస్తే ఈ 10 స్నాక్స్‌ట్రై చేయండి!



బరువు తగ్గాలంటే స్నాక్స్ పూర్తిగా మానాల్సిన అవసరం లేదంటున్న నిపుణులు

మసాలా మజ్జిగలో ప్రోటీన్.. దీంతో ఎక్కువ సేపు కడుపు నిండిన భావన

చిలగడదుంపతో తీపి కోరికకు చెక్ పెట్టడంతో పాటు కాంప్లెక్స్ కార్బ్స్

పరిమితంగా తీసుకుంటే పనీర్, డార్క్ చాక్లెట్, పీనట్ బటర్ కూడా మంచివే

వేయించిన పనీర్ ముక్కలు, పుచ్చకాయ, నట్స్ కూడా మంచివే!

బరువు తగ్గాలంటే స్నాక్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాల్సిన అవసరం లేదు. భోజనాల మధ్య ఎక్కువ గ్యాప్ వస్తే మరింత ఆకలి వేయొచ్చు. దీంతో తర్వాతి భోజనంలో ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. అందుకే ఆకలిని అదుపులో ఉంచే స్నాక్‌ను ఎంచుకోవడం ముఖ్యం. ఎన్డీటీవీ కథనం ప్రకారం.. పోషకాహార నిపుణురాలు లవ్‌నీత్ బాత్రా 10 స్నాక్స్ సూచించారు. అవేంటో చూద్దాం.

1. మసాలా మజ్జిగ: ఈ లిస్ట్‌లో మసాలా మజ్జిగకు మొదటి స్థానం ఇచ్చారు. ఇందులో ప్రొటీన్ ఉండటంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుందని లవ్‌నీత్ బాత్రా చెబుతున్నారు.

2. కాల్చిన చిలగడదుంప: చిలగడదుంపలో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. తీపి తినాలనిపించినప్పుడు కూడా ఇది మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని నిపుణురాలు సూచించారు.

3. మరమరాల చాట్: మరమరాలతో తయారు చేసే చాట్ పెద్ద పరిమాణంలో తిన్నా కేలరీలు ఎక్కువగా చేరకుండా చూసుకోవచ్చని ఆమె చెబుతున్నారు. ఇందులో కూరగాయలు కలిపితే మరింత పోషకాహారంగా మారుతుంది.

4. కూరగాయలు.. శనగల పేస్ట్: కీర, క్యారెట్ వంటి కూరగాయల ముక్కలను శనగలతో తయారు చేసిన పేస్ట్ (హమ్మస్)తో కలిపి తినొచ్చు. కూరగాయల నుంచి ఫైబర్, శనగల పేస్ట్ నుంచి ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. తేలికగా ఉండే ఈ స్నాక్ ఆకలిని కొంతసేపు అదుపులో ఉంచుతుంది.

పప్పు ఇలా వండుతున్నారా? పోషకాలు తగ్గిపోవచ్చు..



పప్పులను ఎలా వండుతున్నాం? ఎలా తింటున్నామన్నది కూడా ముఖ్యమంటున్న నిపుణులు

పప్పులను వండే ముందు కనీసం రెండు గంటలు నానబెట్టాలని సూచన

సహజంగా కనిపించే అన్‌పాలిష్డ్ పప్పులను ఎంచుకోవడం మంచిదని సలహా

ఒకే రకం పప్పు తినడం కంటే రకాలు మార్చి తినడం మంచిదంటున్న నిపుణులు

పప్పుతో సలాడ్లు, స్నాక్స్, రొట్టెల వంటివి చేసుకుంటే రోజూ తినే అవకాశం ఉంటుందని సూచన

భారతీయ వంటకాల్లో పప్పుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు ఇలా రకరకాల పప్పులు మన రోజువారీ ఆహారంలో భాగంగా ఉంటాయి. ఇవి ప్రొటీన్లు, ఇతర పోషకాలు అందించడంతో పాటు జీర్ణక్రియకు కూడా మేలు చేస్తాయి. అయితే పప్పును ఎలా వండుతున్నాం? ఎలా తింటున్నామన్నది కూడా చాలా ముఖ్యం. కొన్ని చిన్న పొరపాట్ల వల్ల పప్పులోని పోషకాలు తగ్గిపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పప్పును ముందుగా నానబెట్టాలి

పప్పును వండే ముందు కనీసం రెండు గంటలు నీటిలో నానబెట్టడం మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పప్పులో ఉండే ఫైటిక్ యాసిడ్ వంటి యాంటీ న్యూట్రియెంట్లు తగ్గుతాయి. దీంతో పప్పులోని ప్రొటీన్‌ను శరీరం మెరుగ్గా గ్రహించే అవకాశం ఉంటుంది.అయితే పప్పును నానబెట్టిన నీటిని పారబోయకూడదు. నానబెట్టే సమయంలో బి, సి విటమిన్లలో కొంత భాగం నీటిలోకి చేరుతుంది. ఆ నీటిని పారబోస్తే ఈ పోషకాలు కూడా వృథా అవుతాయి. అయితే నానబెట్టే ముందు పప్పును మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దుమ్ము, పాలిష్, ఇతర మలినాలు తొలగిన తర్వాతే నానబెట్టాలి.

మెరిసే పప్పులు వద్దు

నిపుణుల సూచనల ప్రకారం.. పప్పు ఎంపికలోనూ జాగ్రత్త అవసరం. మెరుస్తూ కనిపించే పప్పులను కాకుండా సహజంగా కనిపించే అన్‌పాలిష్డ్ పప్పులను ఎంచుకోవడం మంచిది. వీటిలో సహజ పోషకాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

ఒకే పప్పుతో ఆగిపోవద్దు

రోజూ ఒకే రకం పప్పు తినడం కంటే రకాలు మార్చి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒక్కో రకం పప్పులో ఒక్కో రకమైన పోషకాలు ఉంటాయి. అందుకే కందిపప్పు, పెసరపప్పు, మినప్పప్పు వంటి వాటిని ఆహారంలో మారుస్తూ తీసుకోవచ్చు.పప్పుతో సలాడ్లు, స్నాక్స్, రొట్టెల వంటి వంటకాలు కూడా చేసుకోవచ్చు. ఇలా రకరకాలుగా తీసుకుంటే రోజువారీ ఆహారంలో పప్పును సులభంగా భాగం చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు

సైక్లింగ్‌తో వీర్యకణాల సంఖ్య తగ్గుతుందా?



ఎక్కువసేపు సైక్లింగ్ చేస్తే వీర్య నాణ్యతపై ప్రభావం

వారానికి 5 గంటలకు పైగా సైక్లింగ్‌తో ప్రమాదం

వృషణాల వేడి, ఒత్తిడి ప్రధాన కారణాలని డాక్టర్ల వివరణ

సరైన సీటుతో ఒత్తిడిని తగ్గించుకునే ఛాన్స్

సైక్లింగ్ మధ్యలో విరామాలు తీసుకోవాలని డాక్టర్ల సూచన

సైక్లింగ్ మంచి కార్డియో వ్యాయామం. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు బరువు నియంత్రణకు, కండరాల బలోపేతానికి ఉపయోగపడుతుంది. అయితే ఎక్కువ సమయం, తీవ్రంగా సైక్లింగ్ చేసే పురుషుల్లో వీర్య నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే దీనివల్ల శాశ్వతంగా సంతానలేమి వస్తుందని మాత్రం నిర్ధారణ కాలేదు.

ఎక్కువసేపు సైక్లింగ్‌తో ఇబ్బందేనా?

సాధారణంగా 20-30 నిమిషాల పాటు సరదాగా సైక్లింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదే. కానీ వారానికి 5 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సైక్లింగ్ చేసే పురుషుల్లో తక్కువ వీర్యకణాల సంఖ్య కనిపించే అవకాశం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.ఎక్కువసేపు సైకిల్ సీటుపై కూర్చోవడం వల్ల జననాంగాల మధ్య భాగంపై ఒత్తిడి పెరుగుతుంది. వృషణాల చుట్టూ ఉష్ణోగ్రత పెరగొచ్చు. రక్తప్రసరణ కూడా కొంతకాలం తగ్గొచ్చు. ఇవి వీర్యకణాల సంఖ్య, కదలిక, ఆకృతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

వేడి, ఒత్తిడి కారణమా?

ఎక్కువసేపు బిగుతైన దుస్తులతో సైక్లింగ్ చేయడం వల్ల వృషణాల ఉష్ణోగ్రత పెరగొచ్చు. సరైన సీటు లేకపోతే నరాలు, రక్తనాళాలపై ఒత్తిడి పడే అవకాశం ఉంది. సీటు రాపిడి వల్ల చిన్నపాటి గాయాలు, మంట కూడా రావొచ్చు.వీర్యకణాలు తయారై పూర్తిగా అభివృద్ధి చెందడానికి సుమారు రెండున్నర నుంచి మూడు నెలలు పడుతుంది. అందువల్ల జీవనశైలిలో మార్పుల ప్రభావం వెంటనే కాకుండా కొన్ని నెలల తర్వాత కనిపించొచ్చని నిపుణులు చెబుతున్నారు.ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?ఎక్కువసేపు సైక్లింగ్ చేసే పురుషులు మధ్యలో విరామాలు తీసుకోవాలి. జననాంగాల మధ్య భాగంపై ఒత్తిడి తగ్గించేలా సరైన సీటును ఎంచుకోవాలి. మధ్యలో కట్‌అవుట్ ఉన్న సీట్లు కొంత ఉపశమనం ఇవ్వొచ్చు. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోకుండా మధ్యమధ్యలో లేచి నిలబడటం కూడా ఉపయోగపడుతుంది.సంతానోత్పత్తి ఆరోగ్యానికి వారానికి 150-180 నిమిషాల మితమైన వ్యాయామం సరిపోతుందని డాక్టర్లు సూచిస్తున్నారు. అతిగా, తీవ్రంగా వ్యాయామం చేయడం కంటే క్రమం తప్పకుండా మితమైన వ్యాయామం చేయడం మంచిదని తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్‌లో ఈ తప్పులు చేస్తున్నారా?
ఆపదలో మరింత ప్రమాదం తప్పదు!



గాయపడిన వ్యక్తిని అనవసరంగా కదపొద్దు

స్పృహ లేనివారికి ఆహారం, నీళ్లు ఇవ్వొద్దు

మూర్ఛలో నోట్లో ఏదీ పెట్టొద్దు

కాలిన గాయంపై ఐస్, టూత్‌పేస్ట్ రాయొద్దు

రక్తస్రావంపై కట్టు పదేపదే తీయొద్దు

ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలినా.. ప్రమాదంలో గాయపడినా.. కాలిన గాయమైనా వెంటనే ఏదో ఒకటి చేయాలని అనిపిస్తుంది. కానీ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం మాత్రమే కాదు.. సరైన విధంగా స్పందించడం కూడా చాలా ముఖ్యం. తెలియక చేసే కొన్ని ఫస్ట్ ఎయిడ్ చర్యలు పరిస్థితిని మరింత చేయిదాటేలా చేసే ప్రమాదం ఉంది. మరి ఎలాంటి తప్పులకు దూరంగా ఉండాలి?

గాయపడిన వ్యక్తిని వెంటనే కదపొద్దు

రోడ్డు ప్రమాదం, ఎత్తు నుంచి పడటం వంటి ఘటనల్లో గాయపడిన వ్యక్తిని వెంటనే పైకి లేపడం లేదా మరోచోటికి తరలించడం ప్రమాదకరం. వెన్నెముకకు గాయం అయి ఉంటే కదిలించడం వల్ల పరిస్థితి మరింత దిగజారొచ్చు. వెంటనే ప్రమాదం పొంచి లేకపోతే వ్యక్తిని అలాగే ఉంచి వైద్య సాయం కోసం ప్రయత్నించాలి. అయితే శ్వాసకు ఇబ్బంది ఉంటే శ్వాస మార్గాన్ని తెరిచి ఉంచడం ముందుగా చేయాలి.

స్పృహలో లేని వ్యక్తికి నీళ్లు, ఆహారం ఇవ్వొద్దు

బలహీనంగా కనిపిస్తున్నారని.. నీళ్లు లేదా ఆహారం ఇవ్వడం సరికాదు. స్పృహ తగ్గిన వ్యక్తికి సరిగ్గా మింగడం సాధ్యం కాకపోవచ్చు. దీంతో ఆహారం, నీళ్లు శ్వాసనాళంలోకి వెళ్లి ఉక్కిరిబిక్కిరి అయ్యే ప్రమాదం ఉంది. మందులు కూడా ఇవ్వకూడదు. వ్యక్తి శ్వాస తీసుకుంటున్నా స్పృహలో లేకపోతే, వెన్నెముక గాయంపై అనుమానం లేనప్పుడు రికవరీ పొజిషన్‌లో ఉంచవచ్చు.

మూర్ఛ వచ్చినప్పుడు నోట్లో ఏదీ పెట్టొద్దు

మూర్ఛ వచ్చిన వ్యక్తులు నాలుక మింగేస్తారని చాలామందిలో అపోహ ఉంది. అందుకే నోట్లో చెంచా, గుడ్డ, వేళ్ల వంటి వాటిని పెడుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. నోటికి గాయాలు కావచ్చు. శ్వాసకు అడ్డంకి ఏర్పడొచ్చు. మూర్ఛ వచ్చిన వ్యక్తిని బలవంతంగా పట్టుకోవద్దు. చుట్టుపక్కల ఉన్న ప్రమాదకర వస్తువులను తొలగించి రక్షణ కల్పించాలి.

కాలిన గాయంపై ఐస్, టూత్‌పేస్ట్ రాయొద్దు

కాలిన వెంటనే ఐస్, టూత్‌పేస్ట్, వెన్న, నూనె వంటి వాటిని రాయడం మంచిది కాదు. ఇవి గాయాన్ని మరింత తీవ్రం చేయొచ్చు. కాలిన ప్రాంతంపై చల్లటి నీటిని పోయాలి. చర్మానికి అంటుకోని దుస్తులు, నగలను తొలగించవచ్చు. తీవ్రమైన కాలిన గాయాలకు వెంటనే వైద్య చికిత్స అవసరం.

గాయంపై కట్టును పదేపదే తీయొద్దు

తీవ్రంగా రక్తం కారుతున్నప్పుడు శుభ్రమైన గుడ్డ లేదా డ్రెస్సింగ్‌తో గట్టిగా ఒత్తి పట్టాలి. రక్తం ఆగిందో లేదో చూడటానికి పదేపదే కట్టు తొలగించడం వల్ల గడ్డకట్టే ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది.

గ్యాబ్లింగ్ చుట్టూ తిరిగే పాకెట్ రాకెట్స్!

నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్, మాక్సిమం సిటీ స్టూడియోస్ బ్యానర్లపై రూపొందుతున్న చిత్రం 'పాకెట్ రాకెట్స్'. ఈ సినిమాకు రుద్ర అత్రి దర్శకత్వం వహించనున్నారు. యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ చిత్రంలో త్రినాథ్ వర్మ (కమిటీ కుర్రోళ్ళు ఫేమ్), నిర్మల్ (డెబ్యూ) హీరోలుగా, శ్రియా కొంతం (శుభం ఫేమ్) హీరోయిన్‌గా నటిస్తున్నారు. జేడీ చక్రవర్తి కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీనివాస్ అవసరాల, శ్రీనివాస్ వడ్లమాని, కిరీటి దామరాజు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.గ్యాబ్లింగ్ చుట్టూ తిరిగే ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలయ్యాయి. త్వరలో టీజర్, రిలీజ్ డేట్ ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, కాన్సెప్ట్ పోస్టర్‌ను మేకర్స్ రివీల్ చేశారు. విదేశాల్లో చదువుకోవాలని అనుకునే ఓ కుర్రాడు, ఆ కలను సాకారం చేసుకునేందుకు గ్యాబ్లింగ్‌లోకి దిగడం, ఆ తర్వాత ఆ కుర్రాడి జీవితంలో ఎదురైన పరిస్థితుల్ని ఈ చిత్రంలో ఎంతో ఆసక్తికరంగా చూపించబోతోన్నారు. ఈ చిత్రానికి ఎదురోలు రాజు కెమెరామెన్‌గా, అన్వల్ అలీ ఎడిటర్‌గా పనిచే యనున్నారు. గ్యానీ సంగీతాన్ని అందించనున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాల్ని ప్రకటించనున్నారు.



వెంకీ 'ఆదర్శ కుటుంబం' టాక్

విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఆదర్శ కుటుంబం -- హౌస్ నంబర్ 47 ' సినిమా సందడి మొదలైంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ ఇద్దరూ కలిసి పనిచేయడంతో సినిమాపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీకి సంబంధించి ఓవర్సీస్ ప్రీమియర్ షోల నుంచి తొలి స్పందనలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. త్రివిక్రమ్ టేకింగ్, వెంకటేశ్ కామెడీ టైమింగ్, ఇంటర్వెల్ సీక్వెన్స్‌పై పలువురు ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'గురూజీ ఈజ్ బ్యాక్' అంటూ పోస్టులు పెడుతున్నారు. అయితే ఇవి ప్రారంభ ప్రేక్షకుల అభిప్రాయాలు మాత్రమే.. పూర్తి రివ్యూ, ప్రేక్షకుల నుంచి వచ్చే ఔశీతీఽ శీట వీశీబ్ష్ట్ర ఆధారంగా సినిమాపై స్పష్టత రానుంది.



మద్యం మత్తులో సెల్ఫీ కోసం రచ్చ.. కీర్తి సురేశ్‌కు చేదు అనుభవం



సినీ తారలపై అభిమానులు చూపించే ప్రేమ ఒక్కోసారి ఇబ్బందికరంగా మారుతోంది. తాజాగా నటి కీర్తి సురేశ్‌కు విమాన ప్రయాణంలో ఇలాంటి అనుభవమే ఎదురైంది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు సెల్ఫీ కోసం ఆమెను ఇబ్బంది పెట్టాడు. దీంతో ఆమె భర్త ఆంటోనీ తట్టిల్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. చివరకు విమాన సిబ్బంది సాయం తీసుకోవాల్సి వచ్చిందని కీర్తి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. కీర్తి సురేశ్ తన భర్త ఆంటోనీ తట్టిల్‌తో కలిసి ఇటలీలోని మిలాన్ నుంచి భారత్‌కు విమానంలో వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఓ ప్రయాణికుడు ఆమె వద్దకు వచ్చి సెల్ఫీ అడిగాడు. అతడు సరిగా నిలబడలేకపోవడంతో కీర్తి కాసేపు ఆగాలని సూచించింది. అయితే ఆ వ్యక్తి ఆమె మాటలను పట్టించుకోలేదు. వెంటనే ఫొటో దిగాల్సిందేనంటూ పట్టుబట్టాడు.


విశ్వక్ సేన్ సంచలన ప్రకటన

టాలీవుడ్ యంగ్ హీరో విష్వక్ సేన్ తన రాబోయే సినిమా 'కల్ట్'విషయంలో కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 'అర్నాబ్' తుపాను కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి సంఘీభావంగా సినిమా ను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి తన నిర్ణయాన్ని అ బి , వా న ి ల తో పంచుకున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో తుపాను సృష్టిస్తున్న ఇబ్బందుల గురించి అందరికీ తెలుసని విష్వక్ సేన్ పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో వేడుకలు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని భావించినట్లు తెలిపారు. బాధితులకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని, అందుకే ఈరోజు జరగాల్సిన ప్రీ-రిలీజ్ వేడుకను జుఅఎవశ్రీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో 'కల్ట్' సినిమా ఈవెంట్‌పై ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త అప్‌డేట్ అందింది.



జతగూడే ఏడేడు జన్మల బంధం..

ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఇతిహాసాల్లో ఒకటైన రామాయణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోంది. 'రామాయణం' పేరుతో వెండితెరపై భారీ స్థాయిలో ఆవిష్కరిస్తున్న ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతమ్మగా సాయిపల్లవి నటిస్తున్నారు. రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే కనిపించనున్నారు.నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, యశ్‌కు చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'జతగూడె' పాట విడుదలైంది. 'జతగూడే ఏడేడు జన్మల బంధం.. విశ్వమే కన్న కలయేగా సీతా సీతా రామ్.. వరమాలే వేసేను వైదేహి రఘునందనకి సీతా సీతా రామ్..' అంటూ సాగుతోందీ గీతం. శ్రీరాముడు, సీతమ్మ కళ్యాణంలోని మధురమైన క్షణాలను ఈ పాటలో చూపించారు.ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చిన ఈ పాటకు రాకేందు మౌళి తెలుగు



సాహిత్యాన్ని అందించగా, శిరీష భాగవతుల ఆలపించారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ సినిమా హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతుంది. ఈ ఎపిక్‌లో మొదటి భాగం 2026 నవంబర్ 5న విడుదల కానుంది. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్వీసీ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రేక్షకుల ముందుకు రానుంది

సందేశాత్మకంగా డియర్ ఆస్ట్రోనాట్

యువన్ కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్య రాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచనా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్(ఇందులో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో గురువారం ఓ పాటను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కు సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. "ఆస్ట్రోనాట్' చాలా మంచి ప్రయోగం.గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాను రూపొందించారు గొప్ప సినిమాగా నిలుస్తుంది" అన్నారు. సౌమిత్ మాట్లాడుతూ.. "డియర్ ఆస్ట్రోనాట్'లో అన్ని రకాల భావోద్వేగాలు ఉంటాయి. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది" అని చెప్పారు. శ్రేయసి సేన్ మాట్లాడుతూ..



"ఈ చిత్రంలో అందమైన ప్రేమకథ ఉంటుంది. సినిమా అందరినీ ఆకట్టుకునేలా, అందరిలో స్ఫూర్తి రగిలించేలా ఉంటుంది" అని తెలిపింది. నటీనటులు శరణ్య ప్రదీప్, కమల్ కామరాజ్, గీతా భాస్కర్, కృష్ణవేణి తదితర చిత్రబృందం ఈ వేడుకలో మాట్లాడారు.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.